

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 16 జూన్, 2019 సంచిక : 1

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| వార్షిక చందా ... | రూ॥ 100/- |
| ద్వైవార్షిక చందా. ......... | రూ॥ 200/- |
| ఆజీవ సభ్యత్వం .......... | రూ॥1000/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రా,
రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
**Ph : 9440413455, 9848133565**

**విషయసూచిక** **పుట సంఖ్య**

| | |
|---|---|
| మా వాణి | 2 |
| సాయి సేవక్-శ్రీ శివనేశన్ | 5 |
| జనన మరణ చక్రము | 9 |
| గురుకృప | 13 |
| మాతృసంస్థ కబుర్లు | 19 |
| సాయినాథ దేవాలయం-సత్తెనపల్లి వార్షికోత్సవం | 24 |
| లక్ష్యసిద్ధికి మార్గాలు | 27 |
| నారద గర్వభంగం | 32 |

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



సమర్థ సద్గురుదేవులు శ్రీ సాయినాథుల పాదపద్మాలకిదే ప్రణామాలు. వేసవికాలం పూర్తి కావస్తున్నది. సెలవుల తరువాత బడులు తెరుస్తున్నారు. ఇక తల్లిదండ్రులకు చేతినిండా పని. క్రొత్తగా బడికి పంపవలసిన పిల్లల కోసం స్కూళ్లు వెతకడం, యూనిఫాం, బట్టలు, పుస్తకాలు, సంచులు, పెన్నులు, పెన్సిళ్ళు కొనటం, నగరంలో దూరం స్కూళ్లకు వెళ్లవలసిన పిల్లల కోసం బస్సులో, ఆటోలో మాట్లాడుకోవటం, కనీసం బస్‌పాసులైనా కొనటం- కొన్న పుస్తకాలకు అట్టలు వేయటం, పేర్లు వ్రాసిన లేబుల్సు అతికించటం - యిలా ఎన్నెన్ని పనులో! ఆ పిల్ల సన్నాసులకు ఎంత చదువు అబ్బుతుందో అది పరమాత్ముడికే తెలియాలిగానీ తల్లిదండ్రులకు మాత్రం తల ప్రాణం తోకకు వస్తుంది. పాపం, ఆ టర్మ్ ఫీజులు, స్పెషల్ ఫీజులు, పుస్తకాలు, బట్టలు వంటి వాటికన్నిటికి వాళ్లు జూన్ నెలలో ఖర్చుపెట్టే డబ్బు దెబ్బకు మరో రెండు, మూడు నెలల వరకూ కోలుకోవటం కష్టం కూడా.

అయితే-ఇక్కడ ఒక చిన్న ప్రశ్న యింతగా తల్లిదండ్రులు కష్టపడేదెవరి కోసం. తమ పిల్లలు ఎలాగో ఒకలాగున నాలుగక్షరాలు నేర్చుకొని పైకి రావాలనే గదా మరి! అలా “నాలుగక్షరాలు” నేర్పే బడులే వెదికి తమ పిల్లలను చేరుస్తున్నారా! ఇదీ ప్రశ్న. ఇంతకీ- “ఆ నాలుగక్షరాలు” అనేవి ఏమిటి? ఎ, బి, సి, డీలా? అ, ఆ, ఇ ఈలా, ఇవేవీ కావు- “అక్షరం” అంటే నాశనం లేనిది అని అర్థం. మనం నేర్చుకోవలసిన ఆ మృతి లేనివి ఏమిటి అంటే-మానవతా విలువలు, ధర్మస్థాపనే తన కర్తవ్యం అనే భావన, దేశ ప్రేమ, దైవ చింతన. ఈ నాలుగూ ఉన్నవాడే అసలైన మనిషి. అవి నేర్పేదే అసలైన విద్య. అలాటి విద్య బోధించేవాడే సరైన గురువు-అట్టి గురువు

లుంటేనే సరైన పాఠశాల. అదెలా తెలుస్తుంది. ఒకసారి పరిశీలిద్దాం.

చిన్న పిల్లలను బడిలో చేర్చాలనుకుందాం. మొట్టమొదట మనం చూచేది ఆ బడి మన యింటికి దగ్గరగా-మధ్యాహ్నం వెళ్లి పిల్లవాడికి అన్నం తినిపించి రావడానికి వీలైనంత దగ్గరగా ఉందా లేదా అన్నది. రెండవది ఆ స్కూలు విద్యాస్థాయి (బోధన స్థాయి) ఎలా ఉందన్నది. టెన్త్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారా-ఇకనేం మరి-చేర్చేద్దాం. కానీ, ఇది స్కూలు ఎంచుకొనేందుకు సరైన పద్ధతి కాదు.

ఈ రోజున దేశంలో ఉన్న స్కూళ్లన్నిటిలోనూ-ప్రతి పోటీలోనూ నిలబడి గెలిచే స్థాయిలో ఉన్నాయని మనం భావించే స్కూళ్లలో తయారై వచ్చిన విద్యార్థుల్లో నూటికి డెబ్బై అయిదు శాతం మంది కాలేజీల్లోకి రాగానే-విశృంఖల ప్రవర్తననీ, వెగటు వేషాలనీ ప్రదర్శిస్తుండటం చూస్తూనే ఉన్నాం. దానికి కారణం ఏమిటి? ఆ పాఠశాలల్లో కంప్యూటర్లల్లోకి ఎక్కించినట్లు పిల్లల బుర్రల్లోకి అనేకానేక విషయాలను, పరిజ్ఞానాన్ని ఎక్కించటమే తప్ప-సత్ప్రవర్తనను గురించిగానీ, ధార్మిక చింతననుగాని అలవరిచే ప్రయత్నం చేయటం లేదన్న మాటే గదా? మన దేశ సంస్కృతి సాంప్రదాయాలు, ధార్మిక విషయాలు మన పురాణాలలో, వేదాలలో, భగవద్గీతాది గ్రంథాలలో ఉన్నాయి. అవి సంస్కృత భాషలో ఉన్నాయి. మన స్కూళ్లలో ఆ భాష నేర్పరు. నేర్పినా మనం ఇంగ్లీషు మీదో, హిందీ మీదో చూపిన గౌరవం దాని మీద చూపించం. ఫలితంగా మన ఎల్లలు మన ప్రాచీన శాస్త్రాలూ, విజ్ఞానశాస్త్ర గ్రంథాలూ చదివి తెలుసుకోలేము. మరిక దారేమిటి? గురుబోధ. నేటి ఉపాధ్యాయులూ నిస్సహాయస్థితిలోనే ఉన్నారు. సిలబస్ పూర్తి చెయ్యడాలూ, పరీక్షలు పెట్టడాలూ, దిద్దడాలూ వంటి వాటితోనే వాళ్లకున్న సమయమంతా అయిపోతుంది. పైగా తమ చేతిలో ఉన్న వాళ్లు దేశసంపద అనే భావన వారిలో కొరవడుతోంది. అంచేత పిల్లలకు కావలసిన మౌలిక విషయాలను బోధించే అవకాశంగానీ,





తరగతిలో అందరూ పిల్లల తత్వాలను పరిశీలించి చక్కగా మలిచే వీలు గానీ వాళ్లకు ఉండటం లేదు.

అయితే అన్ని స్కూళ్లు యిలాగే ఉన్నాయని చెప్పలేము. అక్కడక్కడా కొన్ని పాఠశాలలు ఉత్తమ మానవతా విలువలకు, దేశభక్తికీ ప్రాధాన్యత నిచ్చి వాటికి సంబంధించిన కోర్సులను తమ కరిక్యులంలో చేర్చి మరీ బోధింపజేస్తున్నాయి. అయితే అవి అందరికీ చాలవు. అలాంటి స్కూళ్లు యితోధికంగా ఆరంభింపబడాలి. మనం అలాటి పాఠశాలల కోసం వెదకి మన పిల్లలకు సరైన విద్య లభించేలాగా చూడాలి. ఇక్కడొక్క చిన్న పాయింటు శ్రద్ధగా గుర్తుంచుకోగలగాలి. కొన్ని ప్రైవేటు స్కూళ్లు నియమావళినీ, క్రమశిక్షణా రీతులనూ చాలా స్ట్రిక్టుగా అమలు జరుపుతాయి. నిజమే, కానీ, యీ నియమాలు నిర్బంధంగా అమలు చేయకూడదు. అలా అయితే - ఆ నిర్బంధం సడలిపోగానే నియమాలు కూడా పారిపోతాయి. అంచేత ఆడుతూ పాడుతూనే సరైన క్రమంలో నడిచే అలవాటు చెయ్యటం మంచిది. పైగా - మత బోధ వేరు, ధర్మ బోధ వేరు. ఈ విషయాన్ని గూడా తల్లిదండ్రులు బాగా గుర్తుంచుకొని మరీ తమ పిల్లలను "నాలుగక్షరాలు" వచ్చే స్కూళ్లలో వేస్తారని ఆశిద్దాం.

**సత్యం మాతా! పితా జ్ఞానం**
**ధర్మోభ్రాతా దయాసఖః**
**శాంతి పత్నీ క్షమాపుత్రః**
**షడైతే మమ బాంధవా?॥**

**-నాకు సత్యమే తల్లి, జ్ఞానమే తండ్రి, ధర్మమే నా సోదరుడు - కరుణే నాకు మిత్రుడు, శాంతి నా సహచరిణియైన యిల్లాలు, సహనమే నా కుమారుడు. ఈ ఆరుగురూ నా (నిజమైన) బంధువులు.**

సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ఆ రోజుల్లో కోపర్‌గాం వద్ద గల గోదావరి నదిపై వంతెన నిర్మించబడ లేదు. ప్రయాణీకులను పడవల మీద ఒక తీరం నుండి మరొక తీరానికి చేర్చేవారు. పడవ నడిపే వ్యక్తి వీరి వద్ద పైకం తీసుకోకుండానే అవలి ఒడ్డుకు చేర్చాడు. అక్కడ నుండి కాలినడకన షిరిడీకి ప్రయాణం సాగించారు.

**షిరిడీ ప్రవేశము :**

అది 1953వ సంవత్సరం బాబాకు అత్యంత ప్రీతికరమైన శ్రీరామ నవమి ఉత్సవములు ముగిసిన కొద్ది రోజులకే, బాబా పాద ధూళిచే పవిత్రత నొందిన షిరిడీ పావనభూమిపై బాబా షిరిడీలో ప్రకటితమైన శతాబ్ద కాలానికి స్వామీజీ షిరిడీ పుణ్యభూమిపై కాలిడినారు. ఆనాటి నుంచి తమ దేహత్యాగం చేసే వరకు రెండు పర్యాయాలు మాత్రం షిరిడీ పొలిమేరలు దాటి మిగిలిన సమయాన్నంతా సాయి సేవకే వినియోగించి సకల దేవతా స్వరూపి సాయియని, మానవునికి ముక్తి నొసంగే పుణ్య తీర్థాలైన

"హరిద్వార్, మథుర, కాశీ,
షిరిడే మే తీరథ్ సారే హై
సాయి బాబాకే చరణోంమే
చారోధాం హమారే హై"

అని ప్రతి నిత్యము చావడిలో భజన చేయుటయేగాక దానిని త్రికరణ శుద్ధిగా ఆచరించి నలుగురికి ఆదర్శప్రాయుడిగా నిలచిన ధన్యజీవి





శివనేశన్ స్వామీజీ.

షిరిడీలో కాలిడగానే ప్రప్రథమంగా సాయినాథుని లీలా విన్యాసాలకు నెలవైన ద్వారకామాయిని దర్శించి అచట గల బాబా చిత్రపటమును గాంచిన స్వామీజీ ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన శరీరము పులకరించగా మనస్సు ఆనంద డోలికలలో తేలియాడెను. తమ బాల్యంలో వారి ఇంటికి సమీపమున గల గుహలో ప్రతి నిత్యం తాను కొలచే చిత్రపటము ద్వారకామాయిలోని చిత్రపటము ఒక్కటి కావటమే స్వామీజీ సంతసమునకు కారణం. వెనువెంటనే స్వామీజీ బాబాకు సాష్టాంగ నమస్కారమొనరించెను. తన బాల్యం నుండి బాబా తనను రక్షిస్తున్నాడని గ్రహించి సాయి సన్నిధినే తన స్థిరనివాసంగా మార్చుకున్నారు. స్వామీజీతో పాటు వచ్చిన ముగ్గురు సాధువులకు స్వామీజీకి కూడ షిరిడీ సాయి సంస్థాన్ వారు మూడు రోజులు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. నాల్గవ నాడు ఆ ముప్పురు సాధువులు కాశీకి ప్రయాణమై వెడలిపోగా స్వామీజీ మాత్రం షిరిడీలోనే ఉండిపోయారు.

స్వామీజీ షిరిడీ చేరే నాటికి ఆయన వయస్సు 26 సం.లు. అంత యవ్వన వయస్సులో అరిషడ్వర్గాలను జయించడమేగాక ప్రతి క్షణాన్ని సాయిసేవకే వినియోగించిన ధన్యజీవి. ద్వారకామాయి, గురుస్థాన్, చావడి, లెండీబాగ్, బుట్టివాడ, కానిఫ్‌నాథ్, మారుతి, గణేశ్, శంకర, శని మరియు అష్టలక్ష్మి మందిరాలలో కూడ సేవ చేసేవారు. పగలంతా సేవ చేసి రాత్రులందు షిరిడీ సాయి స్టోర్స్ వెనుక భాగములో గల చిన్న గదిలో తలదాచుకునేవారు. ఆ సమయంలో ఆ షాపులో దొంగతనము జరుగగా స్వామీజీ ఆ గదిని ఖాళీ చేసారు. కొన్ని దినములు గడచిన పిదప కానిఫ్‌నాథ్ మందిర పూజారి స్వామీజీ నిస్వార్థసేవకు ముచ్చటపడి స్వామిని కానిఫ్‌నాథ్ మందిరంలో ఉండటానికి అనుమతించటమేగాక రోజు రొట్టె, టీ కూడా ఇచ్చేవాడు. కానిఫ్‌నాథ్ మందిర పూజారి అయిన

చాంద్‌భాయ్ షిరిడీ సాయి సంస్థానంలో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు.

స్వామీజీ ప్రతినిత్యము వేకువజామున 3 గం.లకే నిద్రలేచి ఖండోబా మందిరము దగ్గర గల 'శివుఉధ'లో స్నానమాచరించేవారు. ఆ రోజుల్లో 'శివఉధ'లో నీరు పుష్కలంగా ఉండటంతో ఆ నీటితో ఆ చుట్టుప్రక్కల భూములు సైతం సాగుచేసుకునేవారు. ఒకసారి వర్షాకాలంలో నీటి మట్టం బాగా పెరిగి వేగంగా ప్రవహిస్తున్న సమయంలో స్నానానికి దిగిన స్వామి ఆ వేగానికి నీటిలో కొట్టుకుపోతుంటే ఏమి చేయాలో పాలుపోక "బాబా బాబా" అని ఆర్తితో బాబాను వేడుకొనగానే బాబాయే స్వామిని సురక్షితముగ ఒడ్డుకు చేర్చారు. "నన్ను నమ్మిన వారినెన్నడును నేను పతనం కానివ్వను" అన్న బాబా అభయహస్తం స్వామీజీ జీవితంలో అక్షర సత్యమైనది. ప్రతి నిత్యం స్నానానంతరం సుమారు ఒక గంటసేపు ధ్యానస్థులై 4 గం.లకు ద్వారకామాయి తెరిచే సమయానికి అక్కడకు వచ్చి లెండీబాగ్‌లోని 'బుడ్కి' అనే బావి నుండి నీరు తెచ్చి ద్వారకామాయిని శుభ్రపరచెడివారు. 'బుడ్కి' అనే ఈ బావిని బాబాయే స్వయముగా త్రవ్వుట ప్రారంభించగా భక్తులందరు చేరి ఆ కార్యక్రమమును పూర్తిచేసిరి. బాబా ఈ బావిని 'బుడ్కి' అని పిలచెడివారు. బాబా స్వహస్తములతో త్రవ్విన ఈ బావినీటికి దివ్యశక్తులు గలవు. ఈ నీటిని సేవించినచో అనారోగ్యులు ఆరోగ్యవంతులగుదురు. అలనాటి షిరిడీ గృహస్తులు ఈ నీటిని తమ గృహావసరాలకు సహితము ఉపయోగించెడివారు. 1983 సం.లో ఈ బావి ఎండిపోగ ఎ.ఆర్.షిండే అనే సాయిభక్తుడు తన స్వంత ఖర్చుతో బావిలోని పూడిక తీయించగా పుష్కలముగా నీరూరెను. స్వామీజీ ద్వారకామాయిని అద్దమువలె శుభ్రపరచెడివారు. అటుపిమ్మట బాబా ఛాయా చిత్రములకు, కూర్మమునకు, బాబా ఆసీనుడైన బండకు, బాబా పాదుకలకు గంధము, కుంకుమ బొట్లు పెట్టి పూలమాలలను వేసి అలంకరించెడివారు. శివఉధ నీటితో శని, శంకర, గణపతి, మారుతి





మందిరములను శుభ్రపరచెడి వారు. మధుర మహరాజ్‌లాల్ బాబా అనే సాయి భక్తుడు బాబా తోట నుంచి పుష్పములను తెచ్చి ద్వారకామాయిని అలంకరించెడివారు. ఆయన షిరిడీ నుంచి నిష్క్రమించిన తరువాత స్వామీజీ ఆ పనిని చేసెడివారు. ఈ బాబా పూలతోట 'భక్త నివాస్' దగ్గర ఉండేది.


సాయిబాబా షిరిడీలో గల పురాతన దేవాలయములన్నిటిని తనకు లభించిన దక్షిణ ధనంతో బాగుచేయించగా ఆ మందిరములన్నిటిలోను సేవచేసి తరించిన ధన్యజీవి మన స్వామీజీ.

స్వామీజీ కానిఫ్‌నాథ్ మందిరంలో ఉంటున్న తరుణంలో వేరొక సాధువు వచ్చి అక్కడ మకాం చేయడంతో అక్కడ ఇద్దరు ఉండటానికి వీలుకాక స్వామీజీ తన మకామును మారుతీ మందిరానికి మార్చారు.

ఆ రోజుల్లో కొంతమంది భక్తులు సాధువుల మీద సంస్థానం వారికి ఫిర్యాదు చేయగా సాధువులెవ్వరూ మూడు రోజులకు మించి షిరిడీలో ఉండకూడదని ఉత్తర్వులు జారీ చేసి సాధువులందరినీ షిరిడీ నుండి పంపివేసినారు. కానీ సాయికి అత్యంత ప్రీతిపాత్రుడు, నిస్వార్థ సాయి సేవకుడు, నిరంతర సాయి కీర్తనాభిలాషి అయిన మన స్వామీజీని మాత్రం షిరిడీలో ఉండటానికి అంగీకరించారు సంస్థానం వారు.

అప్పట్లో స్వామికి రోజు గడవటానికి నాల్గు అణాలు సరిపోయేవి. అంత దక్షిణ లభించని రోజు ఒక బన్ను తిని టీ త్రాగే వారు వాటికి కూడ డబ్బులు లేని రోజున లెండీబాగ్‌లోని బావి నీరు త్రాగి కాలం గడిపేవారు. ఎట్టి పరిస్థితులలోను దేనికీ ఎవ్వరినీ యాచించే వారు కాదు. ఆకలికి తాళలేని స్వామీజీ "బాబా నాకు ఆస్తిపాస్తులు వద్దు, ఆకలి బాధ తీరడానికి అన్నమైనా పెట్టించు లేక ఆకలైనా లేకుండా చేయి" అని ప్రార్థించేవారు. స్వామీజీ జీవితంలో పస్తులున్న రోజులు లెక్కించ తరము గాదు. అటువంటి పరిస్థితు లలో సహితం సాయి సేవకు దూరమగుటగాని, భగవంతునిపై తనకు గల నమ్మకము సడలుటగాని జరగలేదు.

**(సశేషం)**



# జనన మరణ చక్రము

## మార్కండేయ మహాపురణం ఆధారంగా

- శ్రీ గురుదేవులు

నరుడు మరణకాలంలో యమధూతల దర్శనం కాగానే భయంతో గజగజ వణికిపోతాడు. సోదరుల్ని తల్లినీ, తండ్రినీ, భార్యనీ, సంతానాన్నీ నిర్విరామంగా పిలుస్తూ రోదిస్తూ ఉంటాడు. ఆ సమయంలో మాటలు స్పష్టంగా ఉండవు. జ్ఞప్తి గూడ సరిగ్గా ఉండదు. దృష్టికి ఒకే రంగు కన్పిస్తూ, కళ్లు తిరిగిపోతుంటాయి. భయము ఆయాసాల చేత ముఖం శుష్కిస్తుంది. అప్పడా జీవుడు ఊర్ధ్వ శ్వాస గలవాడౌతాడు. దృష్టి భంగమౌతుంది. ఈ పరిస్థితులలో జీవుడు శరీరాన్ని వదలివేసి వాయువునకు అగ్రసారియై తాను యింతవరకు చేసిన కర్మల ఫలితముగా పొందవలసిన నరకయాతనల ననుభవించుటకై తల్లీదండ్రియను వారలక్కర లేకుండగనే ఒక కొత్త దేహాన్ని ధరిస్తాడు పూర్వము చనిపోతున్నప్పడు ఉన్నటువంటి రూపము, ప్రమాణము, వయస్సు, అవస్థా, సంస్థానములు గల వాడౌతాడు. అటుపై యమదూతలు వానిని కఠినాలైన త్రాళ్లతో బంధించి దుడ్డుకర్రలతో బాదుతూ సంభ్రాంత చిత్తుడైన వానిని దక్షిణ దిక్కున కీడ్చుకొనిపోతారు.

ఆ పాపాత్ముడిని యమభటులు కుశలతోనూ, ముళ్లకంపలతోనూ, పుట్టలతోనూ, శంకులతోనూ, కొనదేలిన రాళ్లతోనూ నిండిన ప్రదేశాలలోనూ, మండుతున్న మంటలలోనూ వందలకొద్దీ గోతులలోనూ పడవేస్తూ బలవంతంగా ఈడ్చుకుపోతారు. కొన్నిచోట్ల సూర్యుడు తన ప్రచండ కిరణాలచేత దహిస్తూ ఉంటాడు. నక్కల గుంపుల అరపులతో భయంకరమైన యమమార్గంలో యమదూతలు యమలోకంవైపు లాక్కుపోతూ





ఉంటారు. దారిలో నక్కలు అతనిని పీక్కుతింటూ ఉంటై. ఎవరైతే గొడుగు, చెప్పలు, వస్త్రము, అన్నమూ దానం చేస్తారో వారా యమ మార్గంలో సుఖంగా ప్రయాణం చేయగలుగుతారు. ఏ మానవులు భూదానము చేస్తారో అటువంటివారు ప్రకాశవంతమైన విమానాన్నీ అధిష్టించి సుఖంగా స్వర్గానికి పోతారు. పాప పీడితుడైన నరుడీ విధంగా బాధలు పొందుతూ, చనిపోయిన పన్నెండవ రోజున దూతల చేత యమలోకంలో ప్రవేశపెట్టబడుతాడు.

జీవుని కళేబరాన్ని దహనం చేయగానే ఆ జీవునికి ఎంతో దప్పిక వేస్తుంది. యాతనా శరీరాన్ని యమదూతలు కొడుతూ, ఛేదిస్తూ ఉన్నప్పడు పాపజీవుడు దారుణ వేదనను అనుభవిస్తూ ఉంటాడు. బంధువులా జీవుని యుద్దేశించి తిల తర్పణము, పిండ ప్రదానము చేస్తారు. వాటిని యమ దూతలు తీసుకొని జీవునికి ఇస్తారు. ఈ విధంగా నీయబడిన పిండాలను, తిల తర్పణోదకాన్ని తిని, త్రాగి జీవుడు తృప్తి చెందుతాడు. ఆ పన్నెండు రోజుల లోపల బంధువులు తైలాభ్యంగనాన్ని నలుగుపెట్టుకోవటాన్ని మాని వేయాలి. లేనిచో మృతునికి ఆ వస్తువులే భోజనంలో లభిస్తాయి. బంధువులు క్రింద పడుకోవటంచేత మృతునికి క్లేశం దూరమౌతుంది. ఆ సమయంలో బంధువులు చేసే దానాల వల్ల మృతుడు దుఃఖం లేనివాడై ప్రసన్నచిత్తుడౌతాడు.

పండ్రెండవ దినమున యమదూతలు ఆ జీవుని తిరిగి అతని ఇంటికి తీసుకొనిరాగా తననుద్దేశించి యివ్వబడిన తిలోదక (నువ్వులు, నీళ్ళు) పిండాన్నములను భుజిస్తూ పన్నెండవ రోజు పూర్తియైన తరువాత మళ్లీ యమదూతలు తీసుకొనిపోగా అతి భయంకరమూ, ఘోరమూనైన యమలోకాన్ని చూస్తాడు. వెళ్ళుతూనే భయంకరమైన నల్లని దేహముతో ఎర్రని పెద్దకళ్లతో క్రూరంగా కన్పించే కోరలతోనున్న వానిని, మృత్యుదేవత,

కాలదేవత, అంతక దేవత మొదలైన వారితో పరివేష్టింపబడిన వానిని, వందల కొలది వ్యాధి దేవతలతో చుట్టబడిన వానిని యమధర్మరాజును ఆ పాపకర్ముడు చూస్తాడు. అతడు ఆజ్ఞాపించిన ప్రకారము సుకృత దుష్కృతాలను అనుభవిస్తాడు.

అబద్ధ సాక్ష్యం చెప్పేవాడిని రౌరవమనే నరకంలో పడవేస్తాడు. బ్రాహ్మణుని చంపిన వానిని, గోవును చంపిన వానిని, తండ్రిని చంపిన వానిని రౌరవ నరకంలో పడవేస్తారు. ఇతరుల పొలాన్ని, పరభార్యను అపహరించినవాడు, గట్లను కలుపుకొనువాడు, గురుపత్నీ గమనము, కన్యా గమనము చేయువాడు రౌరవ నరకమనుభవిస్తాడు.

ఆ రౌరవ నరకము రెండు వేల యోజనముల పొడవు, అంతే వెడల్పు కలిగి, తొడల లోతు ప్రమాణము కలిగి దాటటానికి వీలులేని గోయి వలె ఉంటుంది. దానినిండా మట్టి బదులు నిప్పలు పోయబడి ఉంటాయి. యమభటులా జీవుని దానిలో పడవేయగానే అతడు తీవ్రమైన మంటలచే బాధపడుతూ అటూయిటూ పరుగెత్తుతూ ఉంటాడు. అతని యాతనా శరీరపు పాదాలు మాటిమాటికీ నిప్పలచేత తగులబడి పగిలిపోయి శిథిల మౌతూ ఉంటాయి. (అలా శిథిలమై మళ్ళీ మొలుస్తూ ఉంటాయి). అహోరాత్రాలలో ఒక్కసారి మాత్రం ఆ జీవుడు పాదాలను నిప్పలేని ప్రదేశంలో పెట్టగలుగుతాడు. అలా రోజుకొక్క అడుగు పెట్టుకుంటూ వేయి యోజనాలనూ అతి కష్టం మీద దాటి బయటపడి మిగిలి ఉన్న పాపాలు అనుభవించటానికి వేరొక నరకంలో పడతాడు.

ఏ దుష్టుడు పరుల భార్యను, ధనమును, సంతతిని హరిస్తారో వాడు అతి భీకరములైన యముని కాలపాశాలతో బద్ధుడై యాతనలను కల్గించే తామిస్ర నరకంలో త్రోయబడుతాడు. అక్కడ యమభటులు వానిని తిట్టి, కొట్టి, భయపెట్టి, నానాహింసలూ పెడుతుంటారు. ఇంతకంటే ఘోర వ్యభిచార నేరాలు చేసిన వానిని యమభటులు అంధతామిస్రమనే





నరకంలో పడవేసి హింసిస్తూ ఉంటే ఆ జీవుడు మతి చూపులు, చెడిన వాడై మొదలంటా నరుకబడిన చెట్టువలె కూలుతూ ఉంటాడు.

నేను, నాది అను స్వార్థభావనతో తన కుటుంబ పోషణ మాత్రమే పరమావధిగా పెట్టుకొని ఇతరుల కష్టాలను పట్టించుకోకుండా ధనాన్ని ఎవడు కూడబెట్టుకుంటాడో వాడు తన సంపదనంతా యిక్కడే వదలిపెట్టి రౌరవ నరకంలో పడి యాతనలననుభవిస్తాడు.

ఎవడు అతి క్రూరంగా కోపంతో పశుపక్షులను బంధించి బాధిస్తాడో ఆ జీవుడు తాను హింసించిన పశుపక్ష్యాదులకు ఎన్ని రోమాలు కలవో అన్ని వేల సంవత్సరాలు కుంభీపాకమనే నరకంలో యాతనలననుభవిస్తాడు. యమభటులు ఆ జీవునిమీద సలసల కాగుతూ ఉండే నూనెను పోస్తూ వుంటారు. ఎవడు తన తల్లిదండ్రులకు, విప్రులకు, బ్రాహ్మణులకు ద్రోహం చేస్తాడో వాడు 'కాలసూత్ర'మనే నరకంలో పడవేయబడి సూర్యాగ్నుల మంటలచేత తపింపచేయబడతాడు. వాని శరీరం లోపల, బైట ఆకలిదప్పల పెనుమంటలు చెలరేగుతూ ఉంటే వాడు ఒకచోట స్థిరంగా ఉండలేక కూర్చుంటూ, తిరుగుతూ, పరుగెత్తుతూ సొమ్మసిల్లిపోతూ ఉంటాడు.

ఎవడు తనకు పరంపరగా వస్తున్న వైదిక మార్గాన్ని వదలి ఇతర పాషండ మతాల్ని స్వీకరిస్తాడో వాడు 'అసిపత్రవన"మనే నరకంలో పడిపోతాడు. అక్కడ యమభటులు వానిని కొరడాలతో కొట్టి తరుముతూ ఉంటే రెండువైపుల పదునున్న కత్తులే ఆకులుగా నున్న ఆ వనములో పరుగెత్తుతూ ఆ కత్తులచేత తన అవయవాలన్నీ చీల్చబడుచుండగా అయ్యో చచ్చితి చచ్చితి, ఎందులకీ విధంగా మతం మార్చుకొని భ్రష్టుడనయ్యానని చింతిస్తూ ఎంతో వేదనపడుచూ మాటిమాటికీ మూర్ఛిల్లి మళ్ళీ కొరడా దెబ్బలు తింటూ ఆ కత్తుల మధ్య పరుగిడుతూనే ఉంటాడు.

**(సశేషం)**

# గురుకృప



స్వామి : నేడు అనేకులు తమ జీవితాన్ని దేశ సేవకు, మానవ సేవకు అర్పించాలని భావిస్తున్నారు. ఆధునిక విద్యాప్రభావం చేతనే ఈ భావన దేశీయుల మెదడుల్లోకి జొరబడిందేమోనని నా నమ్మకం. సహృదయుడు, సద్వర్తనుడు అయివుంటేగాని ఇతరులకు మేలు ఒనరించలేడు. భగవంతుని శరణుపొంది, భగవత్కృపా పాత్రుడైన వాడెన్నడూ తప్పటడుగు వెయ్యలేడు. అలాంటి వ్యక్తుల జీవితమే లోకకళ్యాణానికి వినియోగపడుతుంది. అతడి ప్రతి చర్యా, ప్రతి మాటా, అంతదాకా ఎందుకు అతడి జీవిత విధానమే లోకుల క్షేమానికే వినియోగపడుతుందనడం తథ్యం.

మొదట మూలస్తంభాన్ని పుచ్చుకోమనేవారు శ్రీరామకృష్ణులు. అంటే ఈ దుర్లభమైన మానవజన్మను ప్రసాదించిన ఆ సర్వేశ్వరుని సాక్షాత్కారం పొందమని భావం. మాధవునిలో ప్రగాఢ విశ్వాసం అలవరచుకొని మానవ సేవ ఒనరించు. భగవత్ప్రేరణ జనించి, తాను కేవలం నిమిత్తమాత్రుడననే భావన కలిగితే తనకూ శాంతి, తనవల్ల ఇతరులకూ శాంతిని చేకూర్చిన వాడు కాగలుగుతాడు.

'తన అనుంగు బిడ్డలైన భక్తుల హృదయసీమలో భగవంతుడు విరాజిల్లుతూ ఉంటాడు' అనేవారు శ్రీరామకృష్ణులు. కనుక మన హృదయం పరిశుద్ధంగా ఉండాలి. పరిశుద్ధ హృదయమే భగవన్నిలయం. అపవిత్రమైన హృదయానికి భగవంతుడు సుదూరంలో ఉంటాడు. మన హృదయం మాలిన్యరహితమై, అద్దంలా స్వచ్ఛంగా మెరుస్తూ, పూర్వ వాసనలన్నీ తొలగిపోతేనే, భగవంతునికి అది నివాసయోగ్యం అవుతుంది. అప్పుడే భక్తునికి భగవత్సాక్షాత్కారం కలుగుతుంది, నాయనా!

మనస్సు నిర్మలంగా ఉన్నప్పుడే భగవద్రూపం విస్పష్టంగా గోచరిస్తుంది; అద్దం కనుక మలినంగా ఉంటే ప్రతిబింబం కనబడుతుందా? ఆ అద్దం





అసలు దేనినీ ప్రతిబింబింప చేయలేదు కదా! అట్లే హృదయం మలినమైనప్పుడు భగవంతుని ప్రతిబింబం భాసించదు.

ఇప్పుడు మీరందరూ పిన్నవయస్కులు. మీలో ఏ మాలిన్యం సోకదు. కాబట్టి మీ హృదయ పీఠాన్ని భగవన్నివాసానికి అనువుగా సంసిద్ధం చేయండి. అప్పుడు దాన్లో మరిదేనికీ స్థానం ఇవ్వరాదు.

మీరందరూ పరిశుద్ధులై, శాంతచిత్తులై ఉండండి. ఈ జన్మలోనే భగవత్సాక్షాత్కారం పొందండి. పవిత్ర గ్రంథాలను పఠించడం అలవరచుకోండి. పనికిమాలిన పుస్తకాలు చదువుతూ కాలాన్ని వృథా చేసుకోకండి. భగవంతుని పట్ల భక్తి విశ్వాసాలు ప్రేరేపించని గ్రంథాలు నిరుపయోగం. అవి పాండిత్య పటాటోపానికి మాత్రమే తగును. నాయనా! దుర్లభమైన ఈ మానవజన్మను ధన్యం చేసుకోవాలనే తలంపే ఉంటే, ఆత్మోన్నతిని పొందాలనుకొంటే భగవన్నామాన్ని ఆశ్రయించు. ధ్యానసాగరంలో మునిగిపో, ఉత్తినే పైపైనే తేలుతూ ఉండిపోక. అట్టడుగుదాకా రత్నాకరంలో మునిగితేగాని దాన్లోని రత్నాలు చేజిక్కవు సుమా! 'సంగరాహిత్యమే' మానవ జీవిత ఆదర్శమని చాటిచెప్పడానికే శ్రీరామకృష్ణులు ఈ యుగంలో అవతరించారు.

మనిషి విషయసుఖాల వెంట పరుగులు పెడుతూ పశుప్రాయుడై పోతున్నాడు. నీ జీవితాన్ని సార్థకం చేసుకోదలిస్తే, భగవంతుని ఆశ్రయించు. క్షణికమైన ఈ విషయ సుఖాలను విడిచిపెట్టి నీ జన్మహక్కు అయిన శాశ్వతానందాన్ని సముపార్జించుకో.

విడిచిపెట్టు, ఈ సంసార మోహాన్ని విడిచిపెట్టు. భగవత్ప్రాప్తి కోసం సమస్తం విడిచిపెట్టవలసిందే.

త్వమేవ మాతాచ పితా త్వమేవ<br>
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ<br>
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ

త్వమేవ సర్వం మమ దేవదేవ

నువ్వే తల్లివి, నువ్వే తండ్రివి, నువ్వే నా సఖునివి, బంధువు, నువ్వే నాకు సర్వస్వం అని హృదయపూర్వకంగా భావన చేయాలి.

తుచ్ఛమైన లౌకిక భోగాల జోలికి పోక, భగవంతుణ్ణి ధ్యానిస్తూ ఆయన గుణాలను మననం చేస్తూ కాలం గడిపి మానవజన్మను ధన్యం చేసుకోవడంలోనే నిజమైన సౌఖ్యం ఉంది నాయనా!

దుర్లభం త్రయమేవైత ద్దైవానుగ్రహహేతుకమ్ ।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయమ్ ॥

- వివేక చూడామణి

మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయం - భగవత్సాక్షాత్కారం పొందాలంటే ఈ మూడే ప్రధానమైన సాధనాలని తెలుసుకో.

భగవదనుగ్రహం చేత ఈ మూడు లభించాయి కనుక వీటిని సద్వినియోగం చేసి నీ జీవితం వ్యర్థం కాకుండా నిన్ను ఉద్ధరించుకోవాలి. తాత్కాలికమైన సుఖాలకై దేవులాడక, శాశ్వతానందం కోసం ప్రాకులాడు. మరో మానవజన్మలో మోక్షం దక్కవచ్చునేమోగాని నీకిప్పుడు లభించిన మహాపురుష సాంగత్యం మాత్రం లభ్యం కాకపోవచ్చు అనే సంగతి మాత్రం మరచిపోకు. ఇది మహాదుర్లభం. అనేక జన్మార్జిత పుణ్యఫలం. అనన్య సామాన్యమైన అదృష్టం. అందుకే శ్రీరామకృష్ణుల శిష్యబృందంలో చేరి ఆయన అండను పొందగలిగావు. కొరగాని పనులు చేస్తూ జీవితాన్ని వ్యర్థం చేసుకోకు నాయనా!

శ్రద్ధ! గురువు వచనాల మీద అత్యంత శ్రద్ధ కలిగి ఉంటే, నీకు సాధ్యం కానిది ఏదీ ఉండదు. గురువాక్యం పట్ల శ్రద్ధ లుప్తమైతే పరమార్థాన్ని సాధించలేవు. జీవితం నిష్ఫలమైపోతుంది. మార్జాల కిశోరం తల్లిని ఆశ్రయించినట్లు జీవి భగవంతుణ్ణి ఆశ్రయించాలి, అంటిపెట్టుకొని ఉండాలి. అలా ఆశ్రయించిన నాడు భగవంతుడే నీకు అండగా,





తోడునీడగా ఉండి నిన్ను పరిరక్షిస్తాడు.

నీకున్న తెలివి జ్ఞానసాగరంలో ఎంత దూరం తోడ్కొని పోగలదో తెలియదు కనుక గురువు సాయం అవసరం. భగవంతుడు అవాఙ్మానస గోచరుడు కనుక భగవదనుగ్రహం పొందాలంటే గురువు సాయం ఉండే తీరాలి. ఆయన నీ బాధ్యతను స్వీకరిస్తాడు. తన అశేష ప్రజ్ఞతో నువ్వు భ్రాంతి ప్రమాదాలకు లోనుకాకుండా, నీ స్థితిగతులను అవగతం చేసుకొని నిన్ను కాపాడతాడు. జ్ఞాన సాధనలో గురువు నీకంటే ఎంతో అధికుడు కనుక అటువంటి సద్గురుచరణాలను ఆశ్రయించిన వారికి ఎలాంటి అధోగతీ వాటిల్లదు.

ఆ దేవదేవుని జాడ తెలుసుకునే వరకు మానవుడు నానారకాల భ్రాంతులకు, ప్రమాదాలకు గురికావలసి ఉంటుంది, ఎదుర్కోవలసి ఉంటుంది. అతడు కనుక సద్గురువు శరణు పొందితే చాలు, ప్రమాదాలకు గురికావలసి ఉండదు. 'తండ్రి బిడ్డ చెయ్యి పుచ్చుకొన్నప్పుడు బిడ్డ క్రింద పడిపోయే ప్రమాదం ఉండదు' అనేవారు శ్రీరామకృష్ణులు. తెలిసో తెలియకో నువ్వు తప్పులు చేసినా గురువు వాటిని సరిదిద్దుతాడు.

త్యాగం వల్లనే శాంతి చేకూరుతుంది. శ్రేయసిద్ధిని, శాంతిని పొందాలనుకొంటే వైరాగ్యం అవలంబించు. భగవన్నిమిత్తం సర్వమూ త్యజించాలి సుమా! మనస్సు రాగద్వేషాధీనం అవుతూ ఉంటుంది. కాని మానవుడు దాన్ని నిగ్రహించగలగాలి. సంకల్పశక్తిని సంతరించుకొని, భగవంతుని నిమిత్తం సర్వమూ త్యజించి మనిషి నిస్సంగి, విరాగిగా మారితే తప్పక నారాయణుని దర్శించగలుగుతాడు నాయనా!

సన్న్యాసానికి, కాషాయాంబర ధారణకు నిజానికి ఎటువంటి సంబంధమూ లేదు. కావి గుడ్డలు కట్టినంత మాత్రాన కామినీ కాంచన త్యాగినని చెప్పనగునా? సన్న్యాసం, త్యాగం ఆడంబరార్థం కావని గుర్తుంచుకో. కించిత్తు స్వార్థం కూడా లేకుండా భగవంతునికి పూర్తిగా

తనను అర్పించుకొన్నవాడే, ఆత్మార్పణ చేసుకొన్నవాడే నిజమైన సన్యాసి.

"సర్వేశ్వరా! ఈ నా దేహం, బుద్ధి సర్వం నీకు సమర్పించుకొంటున్నాను. ఇవన్నీ నువ్వే, వీటిని ఉపకరణాలుగా వినియోగించుకో" అంటూ సదా సర్వవేళలా భగవంతుని ప్రార్థించాలి.

"పరమేశ్వరా! నాకు శుభాశుభాలంటే ఎలాంటివో తెలియదు. నేను నీ వాణ్ణి. పాలముంచినా, నీటముంచినా నీదే భారం తండ్రీ!" అంటూ వేడుకోవాలి, సదా ఇట్లే ఉండాలి నీ ప్రార్థన. భగవంతుడు తప్ప వేరే గతి లేదని భావించాలి.

మరో ముఖ్య విషయం గమనించాలి. భగవత్సాక్షాత్కారమే మానవ జీవిత పరమ లక్ష్యమని తెలుసుకొన్నావు కదా! జనం నిన్ను దూషించినా, గౌరవించినా, తృణీకరించినా, సముచిత స్థానం లభించినా, లభించకున్నా, శరీరం ఉన్నా - శిథిలమైపోయినా నీ ఆదర్శాలను నియమనిష్ఠలను ఏమాత్రం విడిచిపెట్టరాదు సుమా! ఎట్లైనా ఈ జన్మలోనే భగవత్సాక్షాత్కారం పొంది తీరాలనే దృఢనిశ్చయంతో ఉండాలి. నీ జీవితాన్ని ఈ తీరుగా మలుచుకోగల శక్తిమంతుడవైతే, నువ్వు భగవాన్ శ్రీరామకృష్ణుల సంతతి అని నమ్ముతాను; సాధుసాంగత్యంలో నీ జన్మ పావనం చేసుకొన్నావని గ్రహిస్తాను.

మరో సంగతి కూడ గమనించు. గురువు అంటే ఎవరు? బ్రహ్మజ్ఞాని. నీకే తెలుసు కదా! తనకే దారి తెలియనివాడు ఇతరులకు దారి చూపగలడా? కనుక గురువు సర్వవిదుడన్న విషయం గుర్తుంచుకోవాలి. మంత్రానికి ఎంతో మహిమ ఉంటుంది. కానీ జ్ఞానహీనులు కొందరు స్వార్థపరులై మతం, ధర్మం పేరిట శ్రీరంగనీతులు వల్లిస్తూ, బూటకపు గురువులై మంత్రోపదేశం చేస్తుంటారు. ఆ ఉపదేశాలకు బలం, శక్తి ఉండదు. అవి నీకు శాంతిని చేకూర్చలేవు, జ్ఞానాన్ని కలిగించేపాటి సమర్థత వాటికి ఉండవు.





శ్రీరామకృష్ణుల శిష్య, ప్రశిష్యుల సన్నిధికి వచ్చిన నువ్వు నిజంగా ధన్యుడవు నాయనా! శ్రద్ధాసక్తులు కలిగి, నిష్కపటి అయితే అతడు శ్రీరామకృష్ణుల అండను చేరవలసినవాడే సుమా! ఈ యుగంలో నిజమైన శాంతి లభించేది ఆ ఒక్కచోటనే.

శ్రీరామకృష్ణులు మహోన్నత ఆదర్శాలకు ప్రతిరూపం, శాశ్వతానందానికి సర్వాధికారి.

భగవంతుని ప్రాప్తించుకోవడానికి వలసిన వివిధ సాధనా మార్గాలు శ్రీరామకృష్ణుల శిష్యులకు కరతలామలకమే. నీ అదృష్టం కొద్దీ నీకు ఏ మార్గం ఉపదేశం ద్వారా నిర్దేశించారో, నువ్వు ఆ మార్గంలోనే పురోగమించు. మనసారా గురువును ప్రార్థించు. ఆయన భౌతికంగా ఉన్నా, లేకపోయినా కూడ నీకు మార్గం చూపుతాడు. నిజమైన గురువు శరీరం త్యజించిన పిదప కూడ తాను అదృశ్యంగా ఉండి తన శిష్యులను తరింప తోడునీడై ఉంటాడు నాయనా!

సాధనలు అనుష్టించు, తీవ్రంగా అనుష్ఠించు. సమస్త సంశయాలను వదలిపెట్టు. గురువు చూపిన మార్గంలో సాధన కొనసాగించు. నీ సాధన తీరుతెన్నులను వెల్లడించకు, గుప్తంగా ఉంచు.

ఏకాంతంగా ఏ మూలనో, లేదా ఏ వనానికో వెళ్ళి గోప్యంగా నీ హృదయాంతరాళంలో ధ్యానించమని గురుదేవుల వాక్కు.

కొంతకాలం ఆ రకంగా ధ్యానాన్ని కొనసాగించు. ఆ ధ్యానలీనమైన జీవితం ఎంతో వినోదంగా, ఆహ్లాదకరంగా ఉంటుందో అప్పుడు నీకే తెలుస్తుంది. నీ మనస్సులో, ఆలోచనల్లో, ఆచరణలో ఎంతో మార్పు పొందుతావు.

బ్రహ్మజ్ఞాని అండ లభించిన వారు ఆందోళన చెందనక్కరలేదు. వారు ఎన్నటికీ విజయులే! గురుకృప అంటే అదే!

# మాతృసంస్థ కబుర్లు

ఏప్రిల్ 14న శ్రీరామనవమి. మానవజీవితాలను సంస్కరించగల మహాకావ్యం రామాయణం. రాముడంటే ధర్మం. ధర్మం అంటే రాముడు. రామో విగ్రహవాన్ ధర్మః అన్నారు. ధర్మం వేరేలేదు. రాముడే ధర్మం అని, ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో రామాయణం నేర్పిస్తుంది. రాముని వంటి ఆదర్శమూర్తి 'నభూతో న భవిష్యతి" మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.

శ్రీరాముని జన్మదినంనాడే కళ్యాణం కూడా జరుగుతుంది. పల్లెటూళ్లలో పెద్దపెద్ద పందిళ్లు వేసి అంగరంగ వైభవంగా జరుపుకునేవారు. మనుషులు లౌకిక వ్యామోహంలోపడి రామభక్తి కరువైపోయి తంతు మాత్రమే చేస్తూ వస్తున్నారు. ఆర్భాటానికి తావు ఇస్తున్నారు కాని ఆధ్యాత్మికతకు తావు లేకుండా పోతుంది.

ఆశ్రమంలో శ్రీరామనవమి వస్తుందనడంతో పెళ్లి సందడి మొదలయ్యింది. ప్రతి సంవత్సరం పట్టాభిషేకం మాత్రమే జరిగేది. కానీ ఈ సంవత్సరం శ్రీ చెప్యాల బుచ్చిరెడ్డిగార్ల కుటుంబం సమర్పించిన ఇత్తడి విగ్రహాలతో కళ్యాణం జరిపించాలనే ఉద్దేశంతో పెళ్లి ఏర్పాట్లు జరిగాయి. శ్రీరాముడి తరపున శ్రీమతి, శ్రీ విజయలక్ష్మి రఘుగార్లు, సీతమ్మ తరపున శ్రీమతి, శ్రీ లలితకుమారి, రాంమ్మోహన్‌రావుగార్లు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. 10 గం.లకు శాస్త్రోక్తంగా మేళతాళాలతో సీతారాముల ఊరేగింపుతో మంటపానికి తరలివెళ్లారు. మంగళస్నానాలు,ఎదుర్కోళ్ళు, కళ్యాణక్రతువు అన్నీ శాస్త్రోక్తంగా శ్రీ గౌరిభట్ల రామకృష్ణ సిద్ధాంతిగారు జరిపించారు.





ఏప్రిల్ 15 సాయిధామం ఆశ్రమవాసులు, ఆశ్రమ భక్తులు, గురుదేవుల శిష్యులు అందరూ ఓ 31మంది షిరిడీ యాత్రా ప్రయాణం అనుకున్నాం. మూడు నెలల ముందుగానే ఇబ్బంది లేకుండా శ్రీ సాయిరామ చైతన్యగారు టికెట్లు బుక్ చెయ్యడం, అందులో ఐదు రోజుల ట్రిప్ అనగానే అందరిలో చెప్పలేని ఆనందం. ఆశ్రమం పిల్లలందరినీ మాతాజీ ఉన్నప్పడు తీసుకు వెళతా అన్నారు, కుదరలేదు. బాబావారు యిప్పడు రమ్మని ఆదేశించారు. 15వ తేదీ సాయంత్రం గం.5ల కల్లా రైల్వేస్టేషన్‌కి అందరం చేరుకున్నాము. అందరూ ఒకచోట కలిసేటప్పటికి ఏదో తెలియని ఆనందం. మేమందరం గురుకుటుంబీకులం అనిపించింది. ఒకరికొకరు కుశలప్రశ్నలతో చిన్న పిల్లల అల్లరితో ట్రైన్ ఎక్కే సమయం వచ్చేసింది. రైల్లో అందరం సాయి చాలీసా పారాయణ, భజనలతో ప్రయాణం సాగింది. ఎండలు ఎలా ఉంటాయో, ఏంటో అని భయపడుతూ వెళ్లాము. కానీ, బాబా వారి నిండు ఆశీస్సులు మా మీద ఉన్నాయి. నా బిడ్డలు అంత దూరం నుంచి నన్ను చూడటానికి వస్తే వాళ్ళని కష్టపెడతానా అని రైలు దిగగానే మంచివాన వాతావరణమంతా ఒక్కసారిగా చల్ల బడింది. రాజభవనం లాంటి నివాసగదులు, కిందనే బాబా ప్రసాదం. దేనికీ కూడా లోటు జరుగలేదు. స్వామిని చూడగానే ఆ మోములో చిరునవ్వు. నన్ను చూడటానికి వచ్చావా రా! అని పిలుస్తున్నట్లు అనిపించింది. ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ ఆ సుందరరూపాన్ని దర్శించాలనిపిం చింది. అందరం బాబా చరిత్ర పారాయణ, సాయి చాలీసా 108 సార్లు పారాయణలు, జపం, ధ్యానం, ప్రదక్షిణలు మొదలైనవి చేసాము. గురుస్థానం దగ్గర అందరినీ కూర్చోబెట్టి దాని విశిష్టతను తెలియజేసారు సాయిరామ చైతన్యగారు. ఐదురోజులు ఆనంద ధామములో చాలా ప్రశాంతంగా గడిచాయి.

17వ తేదీ ఉదయం గం.7లకే వాణి సప్త శృంగి అమ్మవారిని దర్శించ

డానికి బయలుదేరాము. షిరిడీ నుండి 4 గం.లు ప్రయాణం. దారిలో టిఫిన్లకుగాని, భోజనాలకూ గానీ ఏ ఇబ్బంది లేకుండా శ్రీ సాయిరామ చైతన్యగారు ఎప్పటికప్పడు ఆలోచించి ఎవరికీ ఏ ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయించారు. సప్తశృంగిలో అమ్మవారు ఏడు కొండలపైన ఉంటుంది. కింద నుంచి పైకి వెళ్ళే బస్సులను చూస్తుంటే ఆటబొమ్మల్లా కనిపించాయి. చూస్తేనే కళ్లు తిరిగేంత లోయలు చుట్టూరా. గిరిజన ప్రాంతం. అమ్మవారి దర్శనానికి ఆర్.టి.సి.బస్సు ఎక్కాము. ఒక్కో మలుపు దగ్గర మా గుండెలు జల్లుమన్నాయి. డ్రైవర్ల నైపుణ్యం చాలా గొప్పది అనిపించింది. దుష్టులకు దూరంగా ఉండాలని అమ్మవారు అంతపైన ఉన్నారేమో. పెద్దపెద్ద లోయలు, ఆ రోడ్డు మార్గం అసలు ఎలా వేసారో, ఆ నిర్మాణానికి మనుషులు ఎంత కష్టపడ్డారోననిపించింది. పైదాకా వెళ్ళాం అయినా అమ్మ కనిపించలేదు. అక్కడి నుండి రోప్‌వే ద్వారా వెళ్ళి చూడాలి. అందరం ఆ రోప్‌వే ఎక్కాలని ఆరాటపడ్డాము. మా జీవితంలో ఇలాంటి దేవాలయాన్ని కానీ, ఇలాంటి ప్రదేశాన్ని కాని చూడలేదని మేము ఎంతో అదృష్టం చేసుకున్నాం కాబట్టి ఈ అదృష్టం మాకు దక్కిందని వచ్చిన వారందరూ అన్నారు. అమ్మవారు నిండు ముత్తైయిదవలా ఎంతో సుందరంగా దర్శనమిచ్చారు. చూడటానికి రెండు కళ్ళు చాలలేదు.

అక్కడి నుండి నాసికాత్రయంబకేశ్వర స్వామిని దర్శించాము. మందిర ప్రాముఖ్యాన్ని సవివరంగా తెలుసుకున్నాం. దారిలో వస్తూ పంచవటి, కాలారామ్ మందిర్, కాపాల్ మందిరం, సీతమ్మ గుహ మొదలైనవి దర్శించి రాత్రి గం.10లకు మా నివాసానికి చేరుకున్నాము.

19వ తేదీ పూర్ణిమ సందర్భంగా సాయినాథ వ్రతం చేసుకోవాలనుకున్నాం. ముందుగానే ఆశ్రమం నుంచి వ్రతానికి కావలసిన సామాగ్రినీ సమకూర్చుకున్నాం. కొన్ని మాత్రం ఆ రోజు పొద్దునే శ్రీమతి శ్రీలక్ష్మి ప్రేమ





కుమార్‌గార్లు ఏర్పాటు చేసారు. వ్రతానికి ఇది తక్కువైనది అని అనుకోకుండా అన్నీ సమకూరాయి. తెనాలి నుంచి వ్రతానికని శ్రీమతి శ్రీ సాయి మాధురి, బూర్లగడ్డ గోపీకృష్ణగారు మధురమైన తీపి బూందీ పంపించారు. అందరం ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీ సాయినాథుల వారి వ్రతాన్ని చేసుకున్నాము. సాయినాథులకు నృత్య, గీతాలాపనలు కూడా సమర్పించుకొన్నాము.

19 రాత్రి అందరం యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాము. అందరిలో దిగులు, బాధ అందరం విడిపోతున్నాము. ఇలాంటి రోజులు మళ్ళీ రావాలని భారంగా వీడ్కోలు పలికాము.

**కోదండరామ సాయి సన్నిధానం-సత్తెనపల్లి శాఖ**


ఏప్రిల్ 14వ తేదీ శ్రీ కోదండరామ సాయి సన్నిధానంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగినది. ముందురోజు సాయంత్రం ఉత్సవ మూర్తులకు మంగళ స్నానమాచరింపజేసి, నూతన వస్త్రాలంకృతులను చేసి కళ్యాణ కార్యక్రమానికి సిద్ధం చేసారు. 14వ తేదీ ఉదయం గం.6.00లకు సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి క్షీరాభిషేకం, జలాభిషేకాలు జరిగినవి. అనంతరం భక్తులు సమర్పించిన నూతన పట్టు వస్త్రాలతో సీతారామ చంద్రుల వారిని వస్త్రాలంకృతులను కావించారు. అనంతరం పూజా కార్యక్రమాలు జరిగినవి. నూతన వస్త్రధారులై, పూల మాలాలంకృతులైన సీతారామ చంద్రుల వారు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు.

11 గం.లకు వేద పురోహితులు శ్రీ రమేష్ శర్మగారి ఆధ్వర్యంలో ఐదుగురు దంపతులచే స్వామి కళ్యాణ కార్యక్రమాన్ని వేద మంత్రాలతో, మంగళ వాయిద్యాల నడుమ పుణ్యహావచనం, గణపతి పూజ, అంకురార్పణ, ఆదిత్యాది నవగ్రహ దిక్పాలక పూజ, స్వామి వారి ప్రవర

మొదలైన పూజా కార్యక్రమాలతో కళ్యాణ క్రతువు జరిపించారు. నూతన వస్త్రాలతో, వివిధ అలంకారాలతో సీతారామ చంద్రుల వారు భక్తులకు దర్శనమిచ్చారు. సీతాసమేతుడైన కోదండ రాముల వారిని చూడటానికి రెండు కళ్ళు చాలవన్నట్లు భక్తులు పరవశించారు. సీతారామ చంద్రుల వారికి జై అని భక్తులు జయజయధ్వానాలు చేసారు. శ్రీ చొప్పా సుబ్బారావు, పూర్ణకుమారి దంపతులు చేయించిన వెండి కిరీటాన్ని సంప్రోక్షణ చేసి స్వామి వారికి ధరింపజేశారు. కిరీటధారులైన స్వామి వారిని భక్తులు కనులారా దర్శించి ఆనందించారు. అనంతరం పానకం, వడపప్పు, చక్కెర పొంగలి ప్రసాద వితరణ జరిగినది. సాయంత్రం గం.5.00ల నుండి సీతాసమేతుడైన కోదండ రాముల వారు పురవీధులలో ఊరేగింపుగా తరలివెళ్ళారు. భక్తులు స్వామి వారికి వారులు పోసి, హారతులు, కానుకలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. రాత్రి గం.11.00లకు ఊరేగింపు ఆశ్రమానికి చేరుకున్నది.

ఏప్రిల్ 29వ తేదీ సోమవారం సీతారామచంద్రుల వారికి 16 రోజుల పండుగ నిర్వహించాము. నూతన వస్త్రధారులై వివిధ అలంకృత శోభితులై సీతారామ చంద్రుల వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించి తరించారు. పీటలపై కూర్చొని కళ్యాణం జరిపించిన దంపతులచే సీతారామ చంద్రుల వారికి పూజా కార్యక్రమం నిర్వహింప జేసిన అనంతరం ఆశ్రమానికి వచ్చిన మూడు వందల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన భక్తులందరికీ శ్రీరామరక్ష. కార్యక్రమం ఆద్యంతం పూజ్య గురుదేవులు, మాతాజీ గార్ల దివ్య ఆశీస్సులతో, ఎటువంటి ఆటంకం లేకుండా జరిపించగలిగినందుకు మేము ఎంతో సంతోషిస్తున్నాము.





ఓం శ్రీసాయిరాం

# శ్రీ సాయినాథ దేవాలయ పంచమ వార్షికోత్సవం

# మరియు గురుదేవుల విగ్రహావిష్కరణ

## శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం

## ఫణిదం సొసైటీ దగ్గర, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా

**ఫోన్ నెం. 9440413455, 9848133565, 9392948600**

ప్రియమిత్రులారా... గురు బంధువులారా.... శ్రీ కోదండ రామ సాయి అనుగ్రహ పాత్రులారా... నమస్కారం.

సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ కోదండ రామ సాయి సన్నిధానంలో ఆనంద సాయి ప్రభు మందిరంలో శ్రీ సాయినాథుల వారు వేంచేసి 5 సం.లు నిండుతున్న సందర్భంగా పంచమ వార్షికోత్సవం 2019-జూన్ 18 నుండి 20 వరకు జరుగనున్నాయి. శ్రీ సాయినాథుల వారు ఎందరెందరికో ఆధి, వ్యాధులు తొలగించారు. నిస్సంతువులకు సంతతి ప్రసాదించారు. ఆపద కాలంలో ఎందరికో అభయమిచ్చారు. ఆదరించి ఒడిలోకి చేర్చుకున్నారు. భక్తుల కొంగుబంగారమై నిలిచారు. అలాగే ఈ ఆశ్రమ నిర్వాహకులు, సాయిదత్త పీఠాధిపతులు, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్, సాయిధామం, శ్రీ సాయినాథ క్షేత్రం, శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమాల వ్యవస్థాపకులు శ్రీ సాయి ప్రసన్నులు, చీకటిలో తడుముకుంటూ తిరిగే మన జీవితాలకు వెలుగు వాకిళ్ళు తెరిచిన ప్రేమమూర్తి, సాయినాథులను సేవించు విధానమును తెలియజేసిన **పరమపూజ్యులు, గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహరాజ్ వారి పాలరాతి విగ్రహావిష్కరణ స్వస్తిశ్రీ చాంద్రమాన వికారి నామ సంవత్సర జ్యేష్ఠ బ॥ తదియ గురువారం ఉత్తరాషాఢ నక్షత్రయుక్త సింహ లగ్న పుష్కరాంశమునందు త్రయాహ్నిక దీక్షతో ది.20.06.2019 ఉదయం 11.24 ని.లకు "జ్ఞానధామం-3"(ధ్యాన మందిరం)లో** మాన్యులు శ్రీ సహస్రాధిక ప్రతిష్ఠాపనాచార్య యాజ్ఞిక బ్రహ్మశ్రీ వడ్లమూడి మల్లికార్జున దీక్షితుల వారి శిష్యులచే ఈ మహోత్సవం జరుపబడును. కావున భక్తులెల్లరూ శ్రీ సాయి దేవాలయం పంచమ వార్షికోత్సవం మరియు శ్రీ గురుదేవుల విగ్రహావిష్కరణ కార్యక్రమాలలో పాల్గొని చరితార్థులు కావలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

## కార్యక్రమములు

**18.06.2018 మంగళ వారం**

ఉదయం 5.15 కాకడ హారతి

బ్రాహ్మీ ముహూర్తములు, ధ్వజారోహణ, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహం, పంచ గవ్య ప్రాశనము, దీక్షాధారణ, మూలమంత్ర అనుష్ఠానములు.

ఉదయం 6.00 శ్రీ సాయినాథుల వారికి క్షీరాభిషేకం, వివిధ పుష్పాలతో అష్టోత్తర శతనామ పూజ

సాయంత్రం 4.00 శ్రీ సాయినాథుల వారి ఊరేగింపు

6.00 వేద పారాయణము, అఖండ స్థాపనము, అంకురారోహణము, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, గణేశ, నవగ్రహ హోమం

**19.06.2018 బుధ వారం**

ఉదయం 5.15 కాకడ హారతి

ఉదయం 6.00 శ్రీ సాయినాథుల వారికి క్షీరాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ

ఉదయం 8.00 వేద పారాయణ, నిత్యవిధి, వాస్తు పూజ, హోమములు, పంచగవ్య క్షీరాధి వాసములు, అధివాసాంగ హోమములు, రక్షోఘ్న హోమములు, రుద్రహోమములు, దుర్గా సూక్త, పురుష సూక్త, సుదర్శన హోమములు

సాయంత్రం 6.00 ప్రధాన కలశ స్థాపన, ధాన్య, పుష్పాధి వాసము, పంచశయ్యా వాసములు, కళా హోమములు, శ్రీ సూక్త, లక్ష్మీ గణపతి, అఘోర హోమములు





**20.06.2018 గురు వారం**

ఉదయం 5.15 కాకడ హారతి

ఉదయం 6.00 శ్రీ సాయినాథుల వారికి 108 కలశాలతో జల, క్షీరాభిషేకం, అనంతరం విశేష అష్టోత్తర శతనామ పూజ

ఉదయం 7.00 నిత్యవిధి, వేద పారాయణం, రత్నన్యాసము, యంత్ర స్థాపన, కలశస్థాపన

11.24 గురుదేవుల విగ్రహావిష్కరణ, (శ్రీశ్రీశ్రీ మాతా నిర్మల యోగ భారతిగారిచే) కళాన్యాసము, నయనోన్మీలనము, ప్రాణప్రతిష్ఠ, ధేను, తృణాగ్ని, మహీదన దర్శనము, కూష్మాండ బలి, అష్టోత్తర శత కలశ స్థాపనము, పూర్ణాహుతి, ఆశీర్వచనము, వేద పండితులకు సత్కారం, శ్రీ మాతాజీ గారిచే ధార్మిక సభ, మంగళాశీస్సులు, ఆశ్రమం మాటగా ... శ్రీ సాయిరామ చైతన్యగారిచే.

మధ్యాహ్నం 1.00 **అన్నప్రసాద వితరణ**

**ప్రియ సాయి భక్తులారా!**

స్వచ్ఛత, ప్రేమ, నిరాడంబరత, తేజస్సు, విజ్ఞత, కరుణ కలబోసి రూపొందించిన దివ్యమూర్తి మన గురుదేవులు. ఆ చల్లనయ్య పాలరాతి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయగలిగేదీ, ఆ పెదాలపై చిరునవ్వు తేగలిగేదీ మన ప్రేమాభిమానాలు, భక్తి విశ్వాసాలే. అందరూ తరలి రండి. ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో సాయిని అర్చించి తరిద్దాం. అందరికీ ఇదే ఆహ్వానం.

**ఇట్లు**

**ధర్మాధికారి, సాయిధామం**

ఈ ఉత్సవాలకు ఆర్థికంగాగానీ, ధాన్య వస్తు రూపేణాగానీ, సహకారం అందించవచ్చును.

**శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమానికి దారి :** సత్తెనపల్లి హైదరాబాద్-గుంటూరు మార్గంలో ఉన్నది. సత్తెనపల్లి రైల్వే గేటు సమీపంలో ఆశ్రమము ఉన్నది.

# లక్ష్యసిద్ధికి మార్గాలు-భక్తి సహనాలు

- శ్రీ సిహెచ్.సూర్యనారాయణ, న్యూ నల్లకుంట, హైదరాబాద్

సాయిబాబా ఒక మహోన్నతమైనటువంటి అద్భుత శక్తి గల యోగి పుంగవులు. మానవాళి బరువు బాధ్యతలను తానే మోస్తూ, సకలైశ్వర్యము లను ప్రసాదిస్తూ, తననే నమ్ముకున్న భక్తులకు సకలైశ్వర్యములను ఇచ్చి వారిని మోక్షమునకు అర్హులను చేయుచున్నారు.

బాబా వారి హృదయము, వారి వాక్కు, వారి భక్తులయెడ ప్రసరించు చూపు మాతృతుల్యమైనటువంటివి. తల్లి తాబేలు, పిల్ల తాబేళ్లను తన దృష్టి ద్వారా ఎలా అవతలి ఒడ్డు నుండి జాగ్రత్తగా కాపాడుకొనుచున్నదో అటులనే శ్రీ సాయినాథుడు గూడ తమ భక్తులను వారి దృష్టి ద్వారానే కాపాడుచున్నారు. బాబా వారి అమృతతుల్యమైన వాక్కులు వినండి- వారు భక్తులనుద్దేశించి "మీ సేవకులలో సేవకుడను-నేను మీకు ఋణగ్రస్తు డను; మీ దర్శన మాత్రముననే పావనమైనాను. మీ సేవ చేయు భాగ్యము కల్గుట నా పూర్వజన్మ సుకృతము" ఆహాః ఎంత మధురముగా ఉన్నవి బాబా మాటలు-ఏమి ఆపేక్ష వారికి భక్తుల మీద. వారి ప్రేమ, మమకారము వెలకట్టలేనివి. మన అహంకారములను చుట్టచుట్టి వారి పాదముల కడపెట్టి, బాబా వారియందే దృష్టి సారించినచో మన కోర్కెలు ఫలించును. ఇది సాధించుటకు మార్గము మొదటగా మనకు వారియందు సంపూర్ణ మగు నమ్మకము కావలయును.

సాయినాథుడు తమ భక్తులను "నేను" "నాది" అనే భావన వలదన్నారు. కాబట్టి ముందర భక్తులు ఈ "నాది" "నేను" అనే అజ్ఞాన జనిత భావాన్ని వదలి భగవంతుడే యజమానియనీ మనము వారి సేవకులము మాత్రమేననీ గుర్తుంచుకోవాలి.

తనను తాను ఆ భగవంతునికి అర్పించుకొనుట అనెడిది ఆ





భగవంతుని జేరుటకు మరొక మార్గము. ఎవరైతే తమ పంచేంద్రియము లతోసహా, తమను తాము ఆ భగవంతునికి సమర్పించుకొందురో వారే ఆ భగవంతునికి నిజమైన సేవకులవుతారు. భగవద్గీత యందు శ్రీకృష్ణ పరమాత్మ ఒకానొక సందర్భములో అర్జునుని ఉద్దేశించి, "ఓ అర్జునా! ఎవరైతే నాయందే దృష్టిని నిల్పి సర్వస్వమూ నా కొరకే అర్పింతురో, అట్టి వారిని నేను వెన్నంటి యుందును" అన్నాడు. అదే విధముగా బాబా వారు గూడా "నన్నాశ్రయించి నన్నే శరణు జొచ్చిన వానిని నిరంతరము రక్షించు టయే నా కర్తవ్యము" అని నుడివినారు గదా! అయితే మనము సంపూర్ణ భక్తి నమ్మకములతో, సహనము లేదా ఓర్పుతో మరియు ప్రేమతో మన సర్వస్వమును అనగా శరీరము, మనస్సు, ఆత్మ, కుటుంబము, ఐశ్వర్యము లను చిత్తశుద్ధితో ఆ సాయినాథునికి అర్పించిన యెడల వారు మన కోర్కెలను నెరవేర్తురు. క్రమంగా కోర్కెలే లేని ఉత్తమ స్థాయికి తీసుకువెడ తారు. ఇవి నేను అనుభవపూర్వకముగా చెప్తున్న మాటలు. ఎవరు భగవంతుడైన ఆ సాయినాథుని యందు అచంచల విశ్వాసము, భక్తి సహనాలు కలిగియుందురో అట్టి వానికి వాని జీవితకాలమునందు ఎట్టి ఆశాభంగములుగానీ, మరణభీతికాని కలుగవు. వాని సకల కాంక్షలు నెరవేరును. బాబా ఇట్లు చెప్పచుండిరి. ఎవరికి భగవంతునిలో నమ్మకము కలిగినదో, వారికి సాధ్యముకానిది యేదియును లేదు. భక్తి కన్న మిన్న మరేదియూ లేదు. భగవంతుడైన శ్రీరాముడు లంకకు సేతువును దాటుటకు వంతెన కట్టవలసి వచ్చెను. కాని శ్రీరామునియందు సంపూర్ణ భక్తి గల హనుమంతుడు ఒక్క గెంతుతో సముద్రము దాటగలిగెను. ఇంతకన్నా భక్తికి నిదర్శనము ఏమి కావాలి?

బాబా వారు చెప్పిన మాటలను ఒక్కసారి స్ఫురణకు తెచ్చుకొందాము. "నా యందెవరి దృష్టి కలదో, వారియందే నా కటాక్షము కలదు. మీ భారములను నాపై పడవేయుడు. నేను మోసెదను. నా సహాయమును

గాని, సలహానుగాని కోరినచో తక్షణమే ఒసంగెదను. నా భక్తుల గృహములయందు లేమీ అను శబ్దము పొడసూపదు. ఈ వాక్యాలు అక్షరాలా సత్యాలని నేను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

మన కోర్కెలను దీర్చు కల్పతరువు శ్రీ సాయిబాబా. మన క్షేమమును, మన రక్షణను, మన ఆర్థిక స్థితిగతులను బాగుపరచువాడును, మన మంచిని కోరువారునూ, మన ఆప్తుడునూ ఆయనయే. శ్రీ సాయినాధుని యెల్లప్పడు జ్ఞప్తియందుంచుకొనుము. మన బాధలు, కష్టములు, నష్టములు, సుఖములు, జయములు, సమస్తములు శ్రీసాయిబాబా వారికి అర్పించి వారి పాదములను శరణునొందెదముగాక! మంచిగానీ, చెడుగానీ, యేది మనదో అది మన దగ్గర ఉన్నది. అది బాబా కటాక్షముగా మనము భావించాలి. బాబాను రాత్రిపూట నిద్రకు ఉపక్రమించేటప్పడు, నిద్ర నుండి లేవగానే జ్ఞప్తి యందుంచుకొన్నచో వారికారోజు అంతా ఆనందము గడుచును. బాబాకు కనీసము ప్రతి గురువారము పుష్పములు అర్పించండి. మనకు ఆ వారమంతయు సంతోషముగా గడుచును. శుభప్రదమగును. ఇది నిజము.

కాబట్టి ప్రతి ఒక్కరూ, బాబా యందు సంపూర్ణ భక్తి, నమ్మకము, సహనము మరియు ప్రేమ నిలపండి. మన గృహమందు 'లేమి' అను శబ్దము ఉండదు. మన బాగోగులు, మన క్షేమములు ఆ సాయినాధుడే స్వయముగా చూచుకొనును. మన తల్లియు, తండ్రియు ఆ సాయినాధుడే. వారి పాదపద్మముల కడ స్థానము సంపాదించుకొను భక్తుడు ధన్యుడు.

విషాదయోగంలోని జీవిత ఉపదేశాలు

జీవితంలో అందరూ ఏవో ఒకప్పడైనా ఏడుస్తారు. జీవితంలో ఒక్క జ్ఞాని తప్ప ఏడవని వారంటూ ఎవరూ ఉండరు. కొందరు గట్టిగా ఏడుస్తారు. కొందరు గుట్టుగా ఏడుస్తారు అంతే. ఏడ్చేవాళ్ళు లోకంలో రెండు రకాలుగా ఉంటారు. స్వార్థానికై ఏడ్చేవాళ్ళు కొంతమంది. పరార్థానికై





ఏడ్చేవాళ్ళు కొంతమంది. భగవద్గీత విషాదయోగంలో ఈ రెండురకాల వాళ్ళని మనకు చూపించింది. మొదటివాడు ధృతరాష్ట్రుడు. రెండవవాడు అర్జునుడు. ధృతరాష్ట్రుడు స్వార్థానికై ఏడ్చాడు. భీమునికి విషం పెట్టి సముద్రంలో పడవేసిన రోజుకాని, లక్క ఇంటి దహనం రోజుకాని, ద్రౌపదీ వస్త్రాపహరణం రోజుకాని ఏడవలేదీ గ్రుడ్డి రాజు. మహాభారత సంగ్రామంలో 10వ రోజు భీష్మపితామహుడు పడిపోయాడని సంజయుని ద్వారా విని ఇక పాండవులదే విజయమౌతుందని ఏడ్చాడు అంధ భూపతి. తన తప్పిదాలకు ధర్మాన్ని ఆలోచించలేదు. కానీ, యుద్ధంలో భీష్ముడంతటివాడు పడిపోవటానికి ధర్మరాజాదులు ఏదో అధర్మం చేసి ఉంటారని ధర్మాన్ని వల్లిస్తూ "ధర్మక్షేత్రే కురుక్షేత్రే-పాండవాః కిమకుర్వత? అని ప్రశ్న వేస్తూ ఏడ్చాడు.

తన వరకు వస్తే ధర్మమంటూ ఏడ్చాడు ధృతరాష్ట్రుడు. స్వార్థలాలసతతో, ద్రోహచింతనతో కూడి ఏడ్చాడు ధృతరాష్ట్రుడు. అందుకే ఆయన విషాద యోగం కాలేదు కదా, సమూల వంశనాశానికి కారణమైంది.

మరి అర్జునుడు ఏడ్చాడు. నిస్వార్థబుద్ధితో ఏడ్చాడు. నిర్మల బుద్ధితో ఏడ్చాడు. అందుకే అర్జునుని విషాదం యోగమైంది.

**"న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ।"** నేను రాజ్యాన్ని కోరుకోవటం లేదు. రాజ్య సుఖాలను కోరుకోవటం లేదు. అందువలన నాకు ఈ యుద్ధంలో విజయం కావాలని అభిలషించటం లేదు అని ఏడ్చాడు.

అర్జునా! తీరా యుద్ధానికై వచ్చి యుద్ధం వద్దంటావేమిటయ్యా అని అంటావేమో కృష్ణా!

**యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగా స్సుఖాని చ।**

**త ఇమే2వస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ॥**

దుష్టుడైన దుర్యోధనుని బారి నుండి రాజ్యాన్ని గ్రహించి ఏ పెద్దలకు,

పిన్నలకు, భోగాలను, సుఖాలను అందించాలని తపనతో యుద్ధానికి వచ్చానో, తీరా చూస్తే వారందరిని చంపితే కాని రాజ్యం చేతికి వచ్చేటట్లు లేదు. అందువలన నాకీ యుద్ధం వద్దంటూ ఏడ్చాడు అర్జునుడు.

**"పరదుఖః దుఖీః సంప్ పునీతా"** అన్నాడు కబీరుదాసు. పరుల దుఃఖాన్ని చూసి దుఃఖించేవాడు సత్పురుషుడట. అందువలన అట్టి పరోపకార బుద్ధితో, ఏడ్చిన ఏడ్పు అర్జునుని పాలిటికి యోగంగా మారింది. పరమాత్మ అనుగ్రహం కలిగింది. జ్ఞానం పట్టుబడింది. రాజ్యలాభం కలిగింది.

జిజ్ఞాసులారా! నిర్మల హృదయంతో శ్రేయస్సుకై అర్జునునిలాగా ఏడిస్తే మన ఏడ్పూ యోగమౌతుంది. లేకపోతే రోగం వస్తుంది. జీవితమే వ్యర్థమౌతుంది.

ఇదే ధృతరాష్ట్ర అర్జునుల ద్వారా భగవద్గీత మనకు బోధించే పాఠం. కానీ, దురదృష్టవశాత్తూ ఆ కాలంలో ఒక ధృతరాష్ట్రుడుంటే ఒక మహాభారత యుద్ధం జరిగింది. ఇప్పుడు, ఇంటింటా, వాడవాడా, ఊరూరా ధృతరాష్ట్రులే. ఇక ఈ దేశం గతి ఏమిటి?

అందుకే గీతను ఆశ్రయించి అర్జునులు (నిర్మలులు)గా మారండి, మీరు శాంతిని పొందండి, సమాజానికి శాంతి సందేశాన్ని అందించి తరించండి.

## శ్రీ సాయి విద్యాధామం

శ్రీ సాయి విద్యాధామం (సాయిధామం) వారి ఉచిత ఉన్నత పాఠశాల (ఇంగ్లీషు/తెలుగు) (ప్రభుత్వ రికగ్నేషన్ పొందినది) మే 13న విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినది. వరుసగా 20వ సారి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించటం అందరికీ సంతోషం కలిగినది. పాసైన విద్యార్థులందరికీ శ్రీ సాయి ఆశీస్సులు లభించాలనీ, పూజ్య గురుదేవుల, మాతాజీల ప్రేమాశీస్సులు కలగాలని కోరుకుంటున్నాము.







# నారద గర్వభంగం

- శుకవాణి

అనగనగా ఓ మహర్షి. ఆ మహర్షి పేరు నారదుడు. అన్నట్లు నారదుడు మీకు తెలుసేమో గదూ! ఎప్పుడూ నారాయణ! నారాయణ! అంటూ ఉంటాడే- చేతిలో ఎప్పుడూ వీణ ఉంటుందీ-అతనే నారదుడు. ఆయన చాలా గొప్ప భక్తుడు. కూర్చున్నా, నిలబడినా, భోజనం చేస్తున్నా, నీళ్లు త్రాగుతున్నా, పని చేస్తున్నా, విశ్రాంతిగా ఉన్నా, మెలకువగా ఉన్నా నిద్రపోతున్నా సరే - నారాయణ నామస్మరణం మానడాయన. అసలు ఆయన శ్వాస పీల్చటంతోపాటే నారాయణ అంటూ ఉంటాడు.

ఓసారి ఆయన శ్రీమహావిష్ణువును దర్శనం కోసం వైకుంఠానికి వెళ్లాడు. వెళ్లి విష్ణుమూర్తికీ, లక్ష్మీదేవికీ నమస్కరించి కూర్చున్నాడు. శ్రీహరి నారదునితో ఏవో కబుర్లు చెప్తున్నవాడు కాస్తా, హఠాత్తుగా కబుర్లాపివేసి భూమి మీదికి చూడసాగారు. నారదుడు "ఏమిటి నారాయణా! ఎవరైనా ఆపదలో పడ్డారా?" అని అడిగాడు. కాస్సేపలా ఏమీ మాట్లాడకుండా అలాగే చూస్తూ కూర్చుండిపోయాడు నారాయణుడు. ఆ తరువాత చిన్నగా నవ్వి, నారదునివైపు తిరిగాడు. నారదుడు ఆసక్తిగా మళ్లీ అడిగాడు "ఏమైంది స్వామీ! ఏ భక్తుడైనా ఆపదలో పడ్డాడా?" అని.

శ్రీహరి నవ్వి, "లేదు నారదా! ఆపద కాదు. ఒక భక్తుడు నన్ను స్మరించాడు. వెళ్లి, ఆశీర్వదించి వచ్చాను" అన్నాడు. నారదునికి ఆశ్చర్యం వేసింది కాస్తంత అసూయ కూడా కలిగింది. ఇంతటి భక్తుడూ, మునీ-తనంతటివాడు-ఎదురుగ్గా వచ్చి కూర్చొని నామస్మరణ చేస్తోంటే లెక్క చేయకుండా ఎవరో భక్తుడు స్మరిస్తే వెడతాడా! అనిపించింది ఆయనకు. లోలోపల ఉడుక్కుంటూ "ఎవరు స్వామీ! అంత గొప్ప భక్తుడు" అని ప్రశ్నించాడు కాస్త హేళనగా. **(సశేషం)**